# ఎడారిలో ఎండమావులు

## ర్యాలి సూర్యనారాయణ

"నేను యం. బి. బి. యస్. చదువు తాను, నాన్నగారూ!" అంది లలిత.

"అలాగేనమ్మా! ముందు ఇది గట్టెక్కనీ!" అన్నారు పరంధామయ్యగారు నవ్వుతూ. సంతోషంతో లోపలికి వెడుతున్న లలితని చూసి పరంధామయ్యగారు ఒక్క నిట్టూర్పు విడిచారు.

పాపం! తల్లిలేనిపిల్ల! లలితకి మూడో ఏట వచ్చేటప్పటికి తల్లిపోయింది. అప్పటి నుంచీ, తల్లీ తండ్రీ తానే అయి, పరంధామయ్యగారే పెంచారు. ఇంతవరకు లలిత కోరిక ఏదీ తీరకుండా లేదంటే, పరంధామయ్యగారు ఆమెని ఎంత గారాబంగా పెంచారో అర్థం అవుతుంది. ఆయనకీ, సంపాదించినది కాకుండా, పిత్రుపైతామహికమైనది కూడా ఉండడంవల్ల చాలాదర్జాగానే బ్రతికారు. లలితకి కూడా తాము గొప్పవారమని గట్టినమ్మకం. ఆడపిల్ల ఐనా, మొగపిల్లవాడయినా లలిత ఒక్కతే కనక, అన్ని కోరికలూ ఆమెలోనే ఫలించేటట్టు చూసుకుని తృప్తిపడుతున్నారు పరంధామయ్యగారు. అందుకనే తన బంధువుల్లో కొంతమంది వారించినా లెక్కచేయకుండా ఆయన లలితని హైస్కూలులో కూడా చేర్పించారు. లలితకూడా పరంధామయ్య ఆశలకి, ఆశయాలకీ ఒక ఆలంబనంగా వుంటూ వచ్చింది. చదువులో ఒకొక్క మెట్టూ సునాయాసంగా పైకెక్కుతూ వచ్చింది. స్కూలందరిలోనూ తెలివైన వారిలోనే లెక్కవేశారు ఆమెని. ఆయేడే స్కూలు ఫైనలు పరీక్షకి వెళ్ళింది.

భావి జీవితాన్ని గురించి, లలితకి కొన్ని విచిత్రాభిప్రాయాలున్నాయి. అందరు ఆడపిల్లల మాదిరి కాకుండా, తాను ఒక ప్రత్యేకత నిలబెట్టుకోవాలని, ఆమె ఆశ! అందుకని పెద్దచదువులు చదవాలనీ, ఆచదువు సార్థకం అయ్యేటట్టు, గొప్ప గొప్ప ఆశయాలతో, పదిమందికీ పనికివచ్చే వృత్తిలో ప్రవేశించి పేరూ ప్రతిష్ఠా సంపాదించాలనీ, ఇంకా ఏవేవో అయిపోవాలనీ ఆశలుపెంచు కుంటూ ఉండేది. అందుకనే డాక్టరు కావాలని కోరుకుంది.

మరొకప్పుడు ఆమె ఆలోచనలు ఇంకో రీతిగా ఉండేవి. తన అందచందాలని గూర్చి కూడా ఆమెకి కొంత ఎక్కువ అభిప్రాయం లేకపోలేదు. వాటి ఆధారంతోనే, తనకి సరిపోయే జీవిత భాగస్వామిని ఎన్నుకోవాలనీ, తాను వెళ్ళినచోటల్లా ఒక వినూత్న పద్ధతి, సంస్కారం కల వాతావరణం సృష్టించాలనీ, గృహాన్ని స్వర్గతుల్యం చేసుకోవడంలో తాను మిగిలిన వారికి ఆదర్శప్రాయంగా ఉండాలనీ కోరుకునేది. ఈవిధమైన ద్వైధీభావంలో పడి లలిత ఊగులాడుతోంది. ఏది ఏమయినా తన ఆశలు ఫలింపచేసుకోవడంలో పట్టుదలా శ్రద్ధకూడ చూపిస్తుంది. చెప్పింది చేసితీరుతుందని ఆమెనిగూర్చి అభిప్రాయం పడిపోయింది ఆమె స్నేహితులకి.

స్కూలు ఫైనలు పరీక్షలో ఘనంగా విజయం పొందడంతో లలిత కాలేజీ చదువు కొరకు యేర్పాట్లు జరిగాయి. మొదటనుంచీ సనాతనాచార సంప్రదాయ సిద్ధమైన వారి కుటుంబంలోని కొందరు వయోవృద్ధులు ఈ విషయంలో పరంధామయ్యగారిని మందలించడానికి ప్రయత్నించారు. దానికి ఆయన ఒక మందహాసంచేసి "పోనీయండి, చిన్నపిల్ల సరదాపడుతోంది. చదువుకుంటే మాత్రం అది ఊళ్ళేలాలా? ఉద్యోగం చేయాలా? అయినా నాకేమంతమంది ఉన్నారని. అమ్మాయి అయినా, అబ్బాయి అయినా మా లలితేకదా!" అని సమాధానం చెప్పేవారు.

కాలేజీలో చేరిన లలితకి ఆ జీవితం మొదట్లో ఉత్సాహంగానే ఉండేది. కాని క్రమేణా విద్యార్థినులపట్ల—అందులోనూ కొంచెం అందంగా ఉన్న విద్యార్థినులపట్ల విద్యార్థులు ప్రవర్తించేతీరు ఆమెకి కొంతబాధ కలిగించింది. అర్థరహితమైన వారి యూథభావాలకి తానుకూడా గురికాక తప్పలేదని తెలిసిన తరువాత మరింత బాధపడింది. అటూయిటూ కాని భావాల బరువుతో ఆమె మొదటియేడు గడిపింది.

ఆ వేసంగిలో పరంధామయ్యగారికి పెద్ద జబ్బుచేసింది. ఇంక లలితకి కాలూచెయ్యీ ఆడలేదు. ఏవేవో భయంకరమైన విపరీత భావాలు బయలుదేరేవి. చెప్పరాని పెద్ద భయం ఆవరించింది. కళ్ళల్లో వత్తులువేసుకుని ఆమెచేసినసేవ ఫలితంగా ఆయన మళ్ళీ మామూలు మనిషి కావడానికి నెలలు పట్టింది.

ఆతరువాత కొన్నాళ్ళకి ఒకరోజున పరంధామయ్యగారు హడావడిగావచ్చి లలితని ముస్తాబుకమ్మనీ, ఎవరో చూడడానికి వస్తున్నారనీ చెప్పారు. అర్థంకాక తండ్రి ముఖంలోకి చూసింది లలిత.

"ఏంజేయను తల్లీ! మొన్నటిలాగే మళ్ళీ యేదైనావచ్చి ఈ ప్రాణం కాస్తా గుటుక్కుమంటే నీగతేంగాను? ఏదో నా కాలూ చెయ్యి తిన్నగా ఉన్నప్పుడే నిన్నొక అయ్యచేతుల్లో పెట్టేస్తే నా బాధ్యత తీరిపోతుంది." అని అన్నారు పరంధామయ్యగారు.

"ఇప్పుడేమంత తొందర వచ్చింది నాన్నా! నా చదువైనా పూర్తికాలేదు కదా!" అని అడ్డు చెప్పింది లలిత. బలీయమైన ప్రవాహంలో కొట్టుకుపోతూ గడ్డిపోచనైనా ఆధారంచేసుకుందామని ప్రయత్నించే అసహాయుని ఆరాటం కనిపిస్తోంది ఆమె ధోరణిలో. పరంధామయ్యగారు,

"దానికేం అడ్డమ్మా? పెళ్ళి అయ్యాకనే చదువు పూర్తిచేసుకోవచ్చు. ముందు ఈ భారం తీరితే—" అని అనబోతోంటే మధ్యలో అడ్డువచ్చి, లలిత "నేను నీకు అంతభారం అయ్యానా నాన్నా!" అంది డగ్గుత్తికతో. ఆ ప్రశ్నవిన్న పరంధామయ్యగారు, వేటకాని అమ్మ(గు)చ్చుకున్న వృద్ధ



# ★ ఎడారిలో ఎండమావులు ★

సింహంలా గిలగిల లాడిపోయారు. తన బిడ్డ తనకి బరువా? ఏమని సమాధానం చెప్పడం? విచారమూ, బాధా కలగాపులగం అయి ఆయన మనస్సును క్షోభింప జేశాయి. ఒక్క క్షణం తమాయించుకుని, బరువుగా అన్నారు "పిచ్చి తల్లీ! దానికి నేనేం చెప్పగలనమ్మా! కాని! మన సమాజ నియమాలని ఎదిరించే స్థాయిలోకి రాలేదమ్మ మనం ఇంకా. ఎంత నాగరికత, విజ్ఞానం ఉన్నా ఎంత ఐశ్వర్యం, అధికారం ఉన్నా పురాతన సంప్రదాయాలనీ, సంఘవ్యవస్థనీ ఒక్కసారి తిరస్కరించి తిరగడం ఎవరితరమూ కాదు. ఎదిగిన ఆడపిల్లకి పెళ్ళిచేయకుండా జాప్యం చేసిన యే తండ్రినీ ఈ సంఘం క్షమించదు. అది ఇరువురకూ కూడా వాంఛనీయం కాదమ్మా! మన ఆశలు ఆశయాలు సంఘానికి అనుగుణంగా రూపొందించుకున్నప్పుడే సుఖం. నీ వింకా చిన్న పిల్లవి. ఈ విషయాలు నీ కప్పుడే అర్థంకావులే."

తండ్రి వెళ్ళిన వైపే చూస్తూ నిలుచుండిపోయింది లలిత. "ఏమిటీ అవాంతరాలు" తానేదో పెద్ద చదువులు చదవాలని యేదో అయిపోవాలనీ అనుకుంటే ఇదేమిటి? అన్నీ తెలిసిన నాన్నగారు అలా అంటున్నారు. నాన్నగారికి తాను ఎదురు పోతుందేమో ననే భయం ఒకవంకా, తానేంచేయలేక పోతున్నాననే ఆవేదన ఒక ప్రక్కా ఆమెకి శాంతిలేకుండా చేశాయి.

౨

పెళ్ళి అయిపోయిన తరువాత నాన్నగారు చేసిన పనికి అంతగా యిదవ్వక్కరలేదనిపించింది లలితకి. ఆ అత్తవారింట్లో తన్నందరూ ఆదరంగా చూస్తున్నారు. ఐశ్వర్యంలోనూ వారు తన పుట్టింటి వారికి తీసిపోరు. అన్నింటికంటె ముఖ్యమైంది-తన ఆశలకి సరిపోయిన భర్తలభించడం. పెద్దచదువు, చదువుకు తగ్గ హోదా, చక్కటి సంస్కృతీ అన్నీ ఉన్నాయి. పైగా తనసెంతో ఆదరిస్తాడు. అంతేకాదు ఆ యింటిలో అంతా కూడా, గొప్ప విద్యావంతులు కావడంవల్ల ఆ యింటి వాతావరణమే విజ్ఞానవంతంగా ఉంటుంది. అందువల్ల పై చదువులగురించి తన కోరిక అణగారి పోనక్కరలేదని ధైర్యం కలిగించి.


నాలుగు మందులుగల
'అనాసిన్' కంటె ఎక్కువ శీఘ్రముగా
పనిచేయునది ఇంకేదీ లేదు

1. క్వినైన్ సల్ఫేట్ 2. ఫినాసిటిన్
3. కఫిన్ 4. అసిటల్ సాలిసిలిక్ ఏసిడ్

'అనాసిన్'—గొప్ప బాధానివారణి—వైజ్ఞానికంగా కూర్చబడిన నాలుగు మందులను గలిగియున్నది, అవి పరముల ముఖ్యస్థానము లందు సంయుక్తచర్యను జరిపి, తలనొప్పులు, జలుబులు, జ్వరము, దంతబాధ, కండ నొప్పులనుండి రూఢిగా, సురక్షితమైన శీఘ్రవిముక్తిని గలిగించును. బాధానివారణకు 'అనాసిన్' కంటె అతివేగముగా పనిచేయునట్టిది మరేదీ లేదు. సేవించుటకు 'అనాసిన్' కంటె అతి సురక్షితమైనట్టిది మరేదీ లేదు జ్ఞాపకముంచు కొనుడు! 'అనాసిన్' వైద్యుని ఔషధయోగము వంటిది. అది గుండెలకు హానిగాని కడుపు ఉద్రేకముగాని కలిగించదు. 'అనాసిన్' లక్షలాది జనులకు బాధానివారణి ఎందుకనగా ప్రతివారున్నూ 'అనాసిన్' ను కొనగలరు.
ఒక ప్యాకెట్ దర 12 నయా పైసలు మాత్రమే.

నాలుగు మందుల
సూత్రమైన
'అనాసిన్'
వాడుడు




జాఫ్రి మేనర్సు అండ్ కంపెనీ (ప్రైవేట్ లిమిటెడ్. రిజిస్టర్డు ఉపయోగకులు.

ఒక ప్యాకెట్ దర 12 నయా పైసలు మాత్రమే

పరిచయస్తులదగ్గర అత్తగారు తననీ, తన సంస్కారాన్నీ పొగడినపుడు ఎంతో సంతోషించింది. తన వాంఛలు ఎండమావులు కావని ఆమెకి నమ్మకం కలిగింది.

పెళ్లి అయిన తరువాత అత్తవారు అభ్యంతరం తెల్పకపోవడంవల్ల ఆ మరుసటి సంవత్సరం చదువు పూర్తి చేసింది. ఇంక మామూలు ధోరణిలో యం. బి. బి. యస్. చదువు ప్రస్తావన వచ్చింది. నలుగురూ నాలుగూ అని చివరికి మొండిచెయ్యి చూపించారు. లలితకి ఎంతో అభిమానం వేసింది. "పెళ్ళి అయ్యాక కూడా చదువులకని కాలేజీలకి వెళ్లడం బాగుండదు" అనీ, "ఈ చదివింది చాలదూ, యింకేం చదవాలి" అనీ, "యం. బి. బి. యస్. అంటే మాటలతో పనా" అనీ యింట్లో వాళ్లందరూ అంటూంటే తన భర్త యేం మాట్లాడడేమని ఆమె యెంతైనా యిదయ్యేది. చదువుకున్న వారు కూడా యిలా అంటే అర్థం ఏమిటి? వీళ్ల చదువు, సంస్కారం ఎందుకు? అందుకేనేమో నాన్నగారు సమాజం ఇంకా ముందుకు పోలేదన్నారు. ఎంత చదువుకుందామనుకున్నా ఈ పరాయి యింట్లో అజ్ఞాత బలీయశక్తులేవో తనని అడ్డగిస్తున్నాయి. "కాదు. కూడదు. తప్పకుండా చదువుతాను." అని గట్టిగా చెప్పలేకపోతుందేం తాను? ఏమిటీ బలహీనత? ఏవిటీ సాంఘిక నియమాలు? ఏం తోచక తండ్రికి జాబు రాసింది. ఆయన మామూలు ధోరణిలోనే సలహాయిస్తూ, అంతగా చదవాలని ఉంటే బి. ఎ. ప్రైవేటుగా కట్టమని రాశారు. ఇదీ బాగానే ఉంది. చదువు మానుకోనూ అక్కరలేదు, పెద్ద చదువులు చదివినట్టూ అవుతుంది, అని తృప్తి పడింది. శక్తి ఉడిగిపోతున్నప్పటికీ విజయకాంక్షతో పోరాడే సైనికునిలా ఆ సలహానే ఆచరణలో పెట్టడానికి పూనుకుంది. అందుకు అత్తింటివాళ్ళేమీ అభ్యంతరం పెట్టకపోవడం ఒక సుగుణం!

తీరా బి. ఎ. పుస్తకాలూ అవీ తెప్పించి చదవడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే భర్తకి ఏదో ఉద్యోగం వచ్చి వేరుగా కాపురం పెట్టవలసి వచ్చింది. అది ఒక విధంగా లాభంగానూ, ఒకవిధంగా యిబ్బంది గానూ తోచింది లలితకి. తన ఆశయాలు నిర్భయంగా ఆచరణలో పెట్టే అవకాశం వచ్చింది—ఒక లాభం. పనిపాటల విషయంలో పెద్దదిక్కు ఉండదు. అన్నీ తనే చేసుకోవాలి. చదువు సాగుతుందో, సాగదో అని యిబ్బంది. అయినప్పటికీ, యింటి పనులతో సతమతమవుతూనే, పట్టుదలగా చదివి బి. ఎ. లో ఒకటి రెండు భాగాలు పూర్తి చేసింది. ఆమె దీక్షకి అందరూ మెచ్చుకున్నారు. ఒక విధమైన విజయగర్వం ముఖంలో వెలిగింది. మూడో భాగం కూడా పూర్తి చేసేస్తే, ఒక డిగ్రీ తెప్పించుకుని, తాను కూడా ప్రయోజకురాలి ననిపించుకోవచ్చు. తన ఆశలు ఈ విధంగానైనా ఫలిస్తాయి. పోనీ అదే చాలు. అందుకని మరింత గట్టిగా చదవడం మొదలుపెట్టింది.

కాని ఈ వ్యామోహంలోపడిన లలిత కొన్ని జీవిత సత్యాలని మరచి పోయింది. స్త్రీ ప్రకృతి విచిత్రమైనదనీ, తత్ఫలితాలు మానవాతీతాలనీ, కొన్ని కొన్ని సమయాల్లో అనుకున్నదానికి అంతా వ్యతిరేకంగా జరుగుతుందనీ ఆమె మరిచి పోయింది. అందులోనూ దాంపత్య జీవితం గడుపుతున్న స్త్రీ అన్నీ అనుకున్నట్టు చేయలేదని తరవాత తెలిసి వచ్చింది. పట్టుదలగా చదివినా పరీక్షకి వెళ్లడానికి వీలులేకపోయింది లలితకి. పురిటి రోజులు దగ్గరికి వచ్చాయి. సాహసించలేకపోయింది. ఈనగాచి నక్కలపాలు చేసినట్లయింది తన జీవితంలో యేమిటో అన్నీ అడ్డంకులే! తాను నిర్మించదలచిన సౌధాలు ఆకాశంలోనే ఉండిపోతాయి కాబోలు. ఇంక ఈ బి. ఎ. పూర్తిచేయడం ఎప్పటికీ పడదేమో కూడా!

అయినా దీక్ష వదలలేదు. ఎలాగో ఆ బి. యే. అయినా అనిపించుకుంటే... ఒక వెర్రి ఆశ యేడిపిస్తోంది. ఒక ప్రక్కన చంటిపిల్లవాడిని చూసుకోవాలి; యింకో ప్రక్క గృహ విషయాలు–చదవగలనా అనే సందేహం కూడా కలిగేది. అలాగే తంటాలుపడి చదివింది. పరీక్షలకివెళ్లి రాసింది. ఒక రకంగా తృప్తి పొందింది. కాని తీరా ఫలితాలు ప్రకటించిన తరువాత ఆ తృప్తి నిరాశగా మారిపోయింది. దాంతో మరింత క్రుంగిపోయింది. ఆశ అంతకంతకీ అణగారిపోతోంది. ఆ తరవాత ఒకటొకటే అవాంతరాలు వచ్చేశాయి. తండ్రి పోవడంతో ప్రోత్సహించి ధైర్యం చెప్పేవారు లేకపోయారు. ఇంటికి పెద్దకోడలు అవడం వల్ల ఏళ్ళు గడిచినకొద్దీ బాధ్యతలు ఎక్కువౌతూ వచ్చాయి. రకరకమైన వ్యాపకాలతో మనస్సు నిండిపోయేది. చదువును గురించిన ఆలోచనే వచ్చేదికాదు. ఈ విధంగా పరాజితలైన ఎందరో ఆడపిల్లల్లో తానుకూడా ఒకత్తె అయిపోయింది.

కాని ఎవరేనా చదుకునే పిల్లల్ని చూసినప్పుడు, యం. బి. బి. యస్. అనే బోర్డు చూసినప్పుడూ, మానుతున్న గాయం రేగినట్టు గిలగిలలాడేది లలిత మనస్సు. అయితే ఏం లాభం? పిపాసార్తితో ఆత్రంగా ఎడారిలో ఎండమావులవైపు వెర్రిగా పరుగులెత్తే బాటసారికి ఎప్పటికైనా దాహశాంతి కలుగుతుందా? ★



E-8